ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3



అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024

నిద్రపోతున్నారా..?

- జిల్లాలో ఆగని చోరీలు
- జాడలేని రికవరీలు
- పోలీస్ బాస్‌లు మారినా అంతే..
- గగ్గోలు పెడుతున్న బాధితులు
- పోలీసుశాఖపై తీవ్ర విమర్శలు


గార్లదిన్నెలో జరిగిన చోరీపై సీసీ పుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం

జిల్లాలో దొంగతనాలకు బ్రేక్ పడటం లేదు. నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. ఇక రికవరీల విషయంలో ప్రగతి ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ పని తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బంగారం, డబ్బు పోగొట్టుకున్న బాధితుల ఆవేదనను పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రత్యేక దృష్టి సారించి దొంగలను పట్టుకునేంత ఓపికలేని పరిస్థితిలో పోలీసు శాఖ ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్లలో 95శాతం మంది వైసీపీ నేతలు సిఫార్సు చేసిన పోలీస్ అధికారులే ఉన్నారు. వారంతా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చెప్పిన పనులు చేయడానికే సరిపోయిందన్న ఆరోపణలున్నాయి. సంవత్సరాలు దాటినా కొన్ని చోరీలు రికవరీ చేయలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. దీంతో పోలీసు శాఖ నిద్రపోతోందనే సెటైర్లు వినిపిస్తున్నాయి.

అనంతలో టైర్ల నుంచి బంగారం వరకు..

అనంతపురం నగరంలో చిన్న చిన్న దొంగతనాలు సైతం రికవరీ చేయలేకపోయారు. ఇక బంగారం గురించి చెప్పనక్కర్లేదు. మూడేళ్ల కిందట నగరంలోని కమలానగర్ డీసీఎంఎస్ రోడ్డులో గోవర్ధన్‌కు చెందిన బైక్ చోరీ అయ్యింది. వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినా రికవరీ లేదని బాధితుడు వాపోతున్నాడు. పాతూరులోని చెరువుకట్ట సమీపంలో ఓ బొలెరో వాహనం టైర్ దొంగిలించారు. కొత్త టైర్ అమర్చిన తర్వాత కూడా దొంగిలించి పోలీసులకు సవాల్ విసిరారు. అప్పట్లో ఎస్పీ ఆదేశించినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు.

- ఈనెల 2న తెలంగాణకు చెందిన చంద్రమౌళి గౌడ్ తన సంస్థ పని నిమిత్తం హౌసింగ్‌బోర్డులోని ఎల్ఐటీ బస్టాప్‌లో బొలెరో వాహనంను ఉంచగా దొంగలు ఎత్తుకెళ్లారు. మరో విడ్డూరమేమిటంటే సీసీ పుటేజీలతో పోలీసులకిచ్చినా రికవరీ చేయకపోవడం గమనార్హం. ఇక బైక్‌ల గురించి లెక్కే లేదు.
- ఏడాదిన్నర కిందట రామచంద్ర అనే ప్రైవేట్ ఉద్యోగి టీవీఎస్ షోరూమ్ కింద బైక్ పార్క్ చేస్తే అదృశ్యమైంది. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే రికవరీ అయ్యాక ఫిర్యాదు చేయాలని సెలవిచ్చారట.
- బళ్లారి బైపాస్‌లో స్కంద వెంచర్‌లో నివాసముండే ఓ ఇంటి యజమాని కుటుంబంతో కలిసి బెంగళూరు వెళ్లారు. ఈ నెల 8న తిరిగి రాగా ఇంట్లో 5తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి, రూ.29వేలు కనిపించలేదు. సీసీ పుటేజీ ఉన్నా అనంతపురం రూరల్ పోలీసులు ఇంకా రికవరీ లేదు. ఇలా నగరంలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌ల నుంచి ఇళ్లలో దొంగతనాల వరకు రికవరీ కేసులు ఎన్నో ఉన్నాయి.

ఎస్పీలు మారినా..

కొన్ని దొంగతనాల కేసుల్లో ఎందరు ఎస్పీలు మారినా రికవరీ ఉండటం లేదు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు ఎస్పీలు మారినా వాటిని రికవరీలు చేయలేకపోయారు.

- గత ఏడాది సెప్టెంబరు 8న కొత్త ఎస్పీ అన్బురాజన్ వచ్చిన రెండ్రోజులకే గార్లదిన్నెలో చోరీ జరిగింది.

బంగారు దుకాణం నిర్వహించే ఓ వ్యక్తి ఇంటి నుంచి దుకాణాలు తీసుకొచ్చి షాపు తెరవబోయాడు. ఇంతలోనే రూ.6.40లక్షల విలువైన నాలుగు తులాల బంగారు ఆభరణాలు 4కిలోల వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. ఇప్పటికీ రికవరీ కాలేదు.

- గత ఏడాది అక్టోబరు 14న ఉరవకొండలో గోపాల్‌రెడ్డి అనే వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. రూ.19లక్షలు చోరీ చేశారు. ఇంకా ఈ కేసు ఛేదించలేదు.
- ఈ ఏడాది జనవరిలో రాయలచెరువులో ఓ బంగారు దుకాణంలో 30 తులాల బంగారు ఆభరణాలు, 10కిలోల వెండి చోరీ అయ్యింది. ఆరునెలలు దాటుతున్నా పోలీసులు ఈ కేసు ఛేదించలేకపోయారు.
- గత ఏడాది నుంచి ఈ ఏడాది వరకు గుత్తి పట్టణంలోని కొన్ని ఇళ్లల్లో, దుకాణాలలో దొంగతనాలు జరిగాయి. బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. వాటిని రికవరీ చేయడంలో విఫలమయ్యారు.

భారీ చోరీలే..

- ఈనెల 20న తెల్లవారుజామున గార్లదిన్నె మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రూ.7.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 24న గార్లదిన్నె మండలం కల్లూరులో చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో 50తులాల బంగారు ఆభరణాలు, రూ.ఐదు లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసును పోలీసులు ఇంకా తేల్చనే లేదు.
- ఈ ఏడాది ఏప్రిల్ 4న పట్టపగలే గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో తులశమ్మ ఇంట్లో భారీ చోరీ జరిగింది. 50తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షలు ఎత్తుకెళ్లారు. ఇప్పటికీ ఈ కేసు ఛేదించలేదు.
- మార్చి 27న యాడికి మండలం రాయలచెరువులో ఒకే రోజు తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. మాదాల సంతోష్ ఇంట్లో ఆరుతులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. అదే గ్రామంలోని సరస్వతమ్మ ఇంట్లో దొంగలు 10తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. కానీ రికవరీ కాలేదు.
- ఏప్రిల్ 6న రాయలచెరువులోని సెల్‌ఫోన్ దుకాణంలో ఐదు స్మార్ట్ ఫోన్లు, నాలుగు కీ ప్యాడ్ సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఇప్పటికీ రికవరీ లేదు.
- ఈ ఏడాది ఏప్రిల్ 8న ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్ల కటవాంజనేయస్వామి ఆలయంలో 40తులాల వెండి ఆభరణాలు, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు.
- మార్చి 21 ఉరవకొండ మండలం రాయంపల్లిలోని పర్వతప్పస్వామి ఆలయంలో హుండీలో రూ.70వేల నగదు చోరీ చేశారు.

గుంతకల్లులో నో రికవరీ..

జిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాల రికవరీలో ఏమాత్రం ప్రగతి లేదు. గుంతకల్లులో రికవరీ అనే మాట వినిపించేది చాలా తక్కువ.

2022 జూన్ 21న గుంతకల్లు పట్టణంలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. 9తులాల బంగారు నగలు చోరీ అయ్యాయి.


గతేడాది ఉరవకొండలోని వ్యాపారి ఇంట్లో బీరువాను పగులగొట్టిన దొంగలు

అదే ఇంట్లోనే మూడున్నర కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనా కేసులో వివరాలు నమోదు చేయలేదట. బాధితుడు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదని తెలిసింది.

- గత ఏడాది నవంబరులో గుంతకల్లు పట్టణంలో రిటైర్డ్ ట్రెజరీ అధికారి నాగభూషణం రాజు ఇంట్లో 50తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి, రూ.62వేల నగదు చోరీ చేశారు. కానీ రికవరీ కాలేదు.

గుంతకల్లు పరిధిలో మూడేళ్ల నుంచి ఇలాంటి చోరీలు కొన్ని రికవరీ కాలేదట. గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీకి వత్తాసు పలికే ఓ అధికారి అవినీతి వ్యవహారాలతో పోలీసింగ్ సరిగా ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


నగర శివారులోని బళ్లారి బైపాస్‌లో ఈనెల 7న ఇంట్లో దొంగలు చొరబడుతున్న పుటేజీ


నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బొగ్గు కిల్లీ



కిల్లీ దందా

- అటవీశాఖలో భారీగా అక్రమాలు
- ఒకచోట అనుమతి.. పలుచోట్ల నిర్వహణ
- కాసులు కురిపిస్తున్న బొగ్గుల అనుమతులు
- అటవీ శాఖ ఆదాయానికి అక్రమార్కుల గండి

అనంతపురం న్యూటౌన్, జూన్ 26: అటవీశాఖలో అక్రమార్కులకు బొగ్గు కిల్లీల అనుమతుల మంజూరు వ్యవహారం కాసుల వర్షం కురిపిస్తోంది. అధికారికంగా ఒక ప్రాంతంలో అనుమతి ఇచ్చి.. పదుల సంఖ్యలో అక్రమంగా కిల్లీలను నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇద్దరు అధికారులు వసూళ్లకు తెరలేపారని ప్రచారం జరుగుతోంది. విషయం తెలిసినా అటవీశాఖ ఉన్నతాధికారి పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా.. శింగనమల ప్రాంతంలోని అక్రమ కిల్లీల గురించి చెబుతున్నారు. కల్లూరు నుంచి తరిమెల వరకు ప్రధాన రహదారి పక్కనే బొగ్గు కిల్లీలు కనిపిస్తాయి. స్థానికుల పొట్ట కొడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చారు. వారు నిబంధనలకు విరుద్ధంగా కిల్లీలను నిర్వహిస్తున్నారని స్థానికులు అంటున్నారు. విషయం తెలిసినా, అధికారులు మామూళ్లు పుచ్చుకుని మౌనంగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమ కిల్లీలకు అడ్డుకట్ట వేస్తే.. అటవీశాఖ ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి, అపరాధ రుసుము విధించినా అటవీ శాఖకు ఆదాయం లభిస్తుంది.

దొరికితే దందా..

ఎల్లుట్ల బీట్‌లో ఈ నెల ఆరంభంలో అక్రమంగా తరలిస్తున్న ఓ బొగ్గుల లారీని స్థానిక సిబ్బంది పట్టేశారు. డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు వాహనాన్ని సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఉంటే ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉందని భావించి, అటవీశాఖ పరిధిలోని ఓ రహస్య ప్రాంతంలో ఆ వాహనాన్ని ఉంచారు. మూడో కంటికి తెలియకుండా వాహనాన్ని దాచినా.. అక్రమార్కులు బేరానికి దిగినట్లు సమాచారం. అటవీశాఖకు చెందిన ఇద్దరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రయత్నించినట్లు తెలిసింది. కానీ ఈ కేసు మొదట్లోనే డీఎఫ్‌ఓ దృష్టికి వెళ్లడంతో ఆ ప్రయత్నం సఫలం కాలేదని తెలిసింది. డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు పట్టుబడిన వాహనానికి రూ.3 లక్షల జరిమానా విధించినట్లు తెలిసింది. ఒక్క వాహనానికే ఈస్థాయిలో జరిమానా వేశారంటే.. తప్పించుకున్న వాటి సంగతి ఆలోచించుకోవచ్చు. కిల్లీ దందా లాభసాటిగా మారడంతో అటవీశాఖలో అక్రమాలు పెరిగిపోయాయని ప్రచారం ఉంది.

పట్టించుకోరా..?

అటవీశాఖలో అక్రమాలను అరికట్టేందుకు శ్రీసత్యసాయి జిల్లా డీఆర్వోకు ఈ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న మరో అధికారి అక్రమాలకు పాల్పడుతున్నా.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నెలలో ఒకటి రెండు సార్లు చుట్టపు చూపుగా వచ్చిపోతుంటారని సమాచారం. దీంతో సిబ్బంది ఆడింది ఆట పాడింది పాట అన్న చందంగా తయారైంది. కొందరు ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టజెప్పి.. అటవీశాఖకు చెందాల్సిన సొమ్మును జేబులో వేసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది.

డీఎఫ్‌ఓకు తెలిసిపోయిందా..?

అక్రమ కిల్లీల వ్యవహారం బయటకు పొక్కడంతో డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ అప్రమత్తమైనట్లు సమాచారం. ఇద్దరు అక్రమార్కులను ఆయన తీవ్రంగా హెచ్చరించారని తెలిసింది. క్షేత్రస్థాయిలో ఎఫ్‌బీఓ, సెక్షన్ ఆఫీసర్ ద్వారా ప్రతి నెలా కిల్లీల నిర్వాహణపై రిపోర్ట్ తెప్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. తాను క్షేత్రస్థాయికి వెళ్లినపుడు అక్రమ కిల్లీలు కనిపిస్తే బాధ్యులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఇప్పటి దాకా దందా నడిపినవారు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తనను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని ఓ అధికారి కోరినట్లు తెలిసింది.

పది అడ్వాన్స్‌డ్ సప్లీలో 62.36 శాతం ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 26 : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 62.36 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 7,784 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,854 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 5,033 మంది పరీక్షలు రాయగా... 3,041 మంది, బాలికలు 2,751 మంది పరీక్షలు రాయగా...1,813 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 60.42 శాతం, బాలికలు 65.09 శాతం ఉత్తీర్ణత సాధించారు.

రాక్రీట్ అక్రమాలను తేల్చండి..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గృహనిర్మాణ శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం..?

అనంతపురం సిటీ, జూన్ 26: గృహనిర్మాణ శాఖ రాక్రీట్ దోపిడీపై సమగ్ర విచారణ చేయాలని ఆ శాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ భారీగా అక్రమాలకు పాల్పడింది. ఆ శాఖ అనకొండ(డీఈఈ), మరి కొందరు ఉన్నతాధికారులు, సిబ్బంది అక్రమాలకు సహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారాలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో సీఎం చంద్రబాబు బుధవారం స్పందించారు. ఆ శాఖ ఎండీకి ఫోన్ చేసి సమగ్ర విచారణకు ఆదేశించారని తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అక్రమాల చిట్టా ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు తీసుకున్న ఎం.శైలజను ఆ శాఖ ఎండీ ఆదేశించారని తెలిసింది. పీడీ ఆదేశాలతో ఆ శాఖలోని కొందరు అధికారులు ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిసింది. దీంతో అవినీతి అధికారుల్లో దడ మొదలైంది. ఆ శాఖ వర్గాల్లో కూడా ఆందోళన మొదలైంది. ఎవరిపై ఏలాంటి చర్యలు ఉంటాయోనని అక్రమార్కులు వణికిపోతున్నారు.

సప్లీలో తగ్గిన ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 26: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. బుధవారం విడుదలైన మొదటి ఏడాది ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 41.03 శాతం, ఒకేషనల్ విద్యార్థులు 60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 24వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకూ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 7,831 మంది పరీక్షలకు హాజరు కాగా.... 3209 మంది విద్యార్థులు పాసయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 662 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 396 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జనరల్, ఒకేషనల్‌లో మొత్తం 8493 మంది విద్యార్థులు రాయగా.... 3605 మంది విద్యార్థులు పాసయ్యారు.

28 నుంచి రీవెరిఫికేషన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలపై రీ వెరిఫికేషన్‌కు విద్యార్థులు ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తు చేయకోవచ్చు. వచ్చే నెల 4వ తేదీ వరకూ రీ వెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు ప్రతి సబ్జక్టుకు రూ. 1000 చెల్లించాల్సి ఉంది. విద్యార్థుల మార్కుల జాబితాలు జూలై 1వ తేదీ నుంచి ఇంటర్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి.

వైసీపీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంటాం

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్/ క్లాక్‌టవర్, జూన్ 26: అనుమతి లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని స్వాధీనం చేసుకొని, ప్రజా అవసరాలకు వినియోగిస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులతో కలిసి హెచ్చెల్సీ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. హెచ్చెల్సీ కార్యాలయ స్థలాన్ని కబ్జా చేసి.. క్వార్టర్స్, చెట్లను కూల్చివేసి, ప్రజల సొమ్ముతో అక్రమంగా వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని ఆయన అన్నారు. నగరపాలక సంస్థ, అహుడా అనుమతులు లేకుండానే ప్యాలెస్‌ను తలపించేలా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని అన్నారు. రెండేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నా నగరపాలక సంస్థ, హెచ్చెల్సీ అహుడా అధికారులెవరూ నోటీసులు జారీ చేయకపోవడం దారుణమని అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో త్వరలోనే వైసీపీ కార్యాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అన్నారు. అధికారంలో ఉంటే ఏమైనా చేయొచ్చనేలా వైసీపీ పాలన సాగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. మంగళగిరిలో తమ పార్టీ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తుంటే అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ద్వారా కోర్టుకు వెళ్లారని, అయితే టీడీపీ చేపట్టిన ప్రతి నిర్మాణం సరైనదేనని కోర్టులు చెప్పాయని అన్నారు.

హెచ్చెల్సీకి కేటాయించండి..

వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని హెచ్చెల్సీకి కేటాయించాలని ఏపీ ఎన్జీఓ, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. వైసీపీ కార్యాలయ భవనాన్ని పరిశీలించేందుకు వచ్చిన అర్బన్ ఎమ్మెల్యేకి వారు వినతిపత్రం అందజేశారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని ఉన్నఫలంగా ఖాళీచేయించారని, ప్రత్యామ్నాయం చూపకుండా నిర్లక్ష్యం చేశారని ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, మహబూబ్ దౌలా అన్నారు. హెచ్చెల్సీ కాలనీలోని మూడు గదుల్లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి తమకు వైసీపీ కార్యాలయ భవనాన్ని కేటాయించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


వైసీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత


కలుషిత నీరు, ఆహారమే కారణం


అస్వస్థతకు గురైన విద్యార్థులు


చికిత్స అందిస్తున్న వైద్యుడు

గుత్తి రూరల్, జూన్ 26: మండల పరిధిలోని రజాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 20 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలో మొత్తం 620 మంది బాలికలు ఉన్నారు. రెండు రోజుల క్రితం ఐదుగురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బుధవారం ఉదయం 20 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే బేతాపల్లి వైద్యులకు ప్రిన్సిపాల్ సమాచారం అందించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం పాఠశాలకు చేరుకుని బాలికలకు చికిత్స చేసింది. మంగళవారం రాత్రి చికెన్ తినడం వల్ల, కలుషిత నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత కూడా విద్యార్థినుల అస్వస్థతకు కారణమని తెలిపారు. గురుకుల పాఠశాల డీసీఓ మురళీకృష్ణ పాఠశాలకు వచ్చి బాలికల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

అతిసారతో వృద్ధుడి మృతి


నాగేంద్ర (ఫైల్)

ఉరవకొండ, జూన్ 26: మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో కురుబ నాగేంద్ర(75) అనే వృద్ధుడు అతిసారతో బుధవారం మృతిచెందారు. మూడు రోజుల నుంచి ఆయన వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలో వారం రోజుల నుంచి అతిసార ప్రబలుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నముష్టూరులో వృద్ధుడి మృతితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అతిసార కేసులకు ప్రత్యేక వార్డు

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జూన్ 26: జిల్లా సర్వజన వైద్యశాలలో అతిసార కేసులకు చికిత్స అందించడం కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆస్పత్రిలో అతిసార కేసులను బుధవారం ఆయన పరిశీలించారు. జనరల్ మెడిసిన్ వార్డు, పిల్లల వార్డులో అడ్మిషన్ కేసులు, డిశ్చార్జి అయినవారి వివరాలు, కొత్త కేసుల గురించి తెలుసుకున్నారు. అతిసార కేసులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో ఫార్మసీలో మందుల నిల్వలను తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో మంగళవారం నాటికి 60 మంది అతిసార బాధితులు ఉన్నారని, వీరిలో 13 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. ఇవి కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొత్త కేసులు వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 51 మంది అతిసార బాధితులు చికిత్స పొందుతున్నారని, ఇందులో అనంతపురం నగరానికి చెందిన నలుగురు ఉన్నారని తెలిపారు. కలెక్టరు, డీఎంహెచ్‌ఓ, నగరపాలిక కమిషనర్‌కు అతిసార కేసుల సమాచారం ఏ రోజుకు ఆ రోజు పంపుతున్నామని అన్నారు. ఆయన వెంట ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, డాక్టర్ భీమసేనాచారి తదితరులు ఉన్నారు.


అతిసార నేపథ్యంలో మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు

హౌసింగ్ పీడీగా శైలజ

● అక్రమార్కుల్లో వణుకు ● గుట్టురట్టయ్యేనా...?



బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి పీడీ శైలజ

అనంతపురం, సిటీ, జూన్ 26: ఎట్టకేలకు జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీగా (ఎఫ్ఏసీ) అనంతపురం ఈఈగా పనిచేస్తున్న శైలజను నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సాయంత్రం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆశాఖ గత ఇన్‌చార్జి పీడీ నరసింహారెడ్డి 15 రోజులపాటు సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆమె జూలై 10వ తేదీ వరకు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆమెకు పలువురు డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. గతంలో జరిగిన అక్రమాలపై తాజా ఇన్‌చార్జి పీడీ అప్పట్లోనే సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వైసీపీ అధికారంలో ఉండటం, తోపు అండతో అనకొండ డీఈఈ, అప్పటి ఇన్‌చార్జి పీడీ సదరు నివేదికను కలెక్టర్‌కు పంపకుండా తొక్కిపెట్టారు. తాజాగా ఆమెను ఇన్‌చార్జి పీడీగా నియమించడంతో ఆశాఖలోని అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఇప్పటికే పత్రికల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో సాగిన అక్రమాలపై కథనాలు రావడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో నూతన ఇన్‌చార్జి పీడీ గతంలో మాదిరిగానే.. ముక్కుసూటిగా వ్యవహరించి అవినీతి అక్రమార్కుల పని పడతారా? వారి గుట్టును రట్టయ్యే విధంగా చర్యలు తీసుకుంటారా అనే చర్చలు హౌసింగ్ శాఖ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి.

ప్రతి మండలంలో పశువైద్య శిబిరాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, జూన్ 26: జిల్లాలోని ప్రతి మండలంలో నిర్దేశించిన తేదీల్లో పశువైద్య శిబిరాలు (గైనిక్ క్యాంపులు) ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు కళ్యాణదుర్గం, కణేకల్లు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, రాయదుర్గం, డి. హిరేహాళ్, కంబదూరు, బెళుగుప్ప మండాల్లోని ఒక్కో గ్రామంలో గైనిక్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే నెలాఖరు దాకా జిల్లాలోని ఏఏ మండలంలోని ఏఏ గ్రామాల్లో ఏ తేదీలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసే షెడ్యూల్‌ను విడుదల చేశామన్నారు. పశువులకు పలు రకాల రోగాలకు చికిత్సలు చేయడంతోపాటు కృత్రిమ గర్భధారణ తదితర అంశాలపై పాడి రైతులకు అవగాహ కల్పించి, ప్రోత్సహిస్తామని తెలిపారు. స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో సంప్రదించి నిర్దేశించిన తేదీల్లో శిబిరానికి హాజరై పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్వరలో 70 కొత్త బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం సుమంత్

ఉరవకొండ, జూన్ 26: జిల్లాకు 70దాకా కొత్త బస్సులు త్వరలో వస్తాయనీ, వాటిలో 40 సంస్థకు చెందిన, మరో 30 అద్దె ప్రాతిపదికన తీసుకుంటామని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్యారేజీని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉరవకొండ, గుంతకల్లు డిపోలలో గ్యారేజీ యార్డు, సిమెంట్, కాంక్రీట్ పనులను రూ.54 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. కారుణ్య నియామకాల కింద 89 మందిని నియమించామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 245 మంది డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపుపై వారం రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 2023-24 సంవత్సరంలో అన్ని పారామీటర్లలో లక్ష్యం అధిగమించినందుకు జిల్లాకు అవార్డు వచ్చిందన్నారు. జిల్లాలోని 7 డిపోల పరిధిలో 491 బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ దయాల్ పాల్గొన్నారు.

కుళ్లిన చికెన్... కల్తీ నూనె..!

● ఫ్రిజ్‌లలో చికెన్ పెట్టి అమ్ముతున్న రెస్టారెంట్లు
● ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో బట్టబయలు



ఫ్రిజ్‌లో ఉంచిన చికెన్

కళ్యాణదుర్గం, జూన్ 26: పట్టణంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బుధవారం పలు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించగా నిర్వహించిన కళ్లుతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో దేవాన్ష్ రెస్టారెంట్, విజయదుర్గ, చాంద్ హోటళ్లలో ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో నాసిరకం కల్తీనూనె వినియోగించి వినియోగదారులకు ఆహారం అందిస్తున్నారని బయటపడింది. దాంతోపాటు దేవాన్ష్ రెస్టారెంట్లో ఫ్రిజ్‌లో నిల్వ వుంచిన కోడి మాంసాన్ని గుర్తించారు. చికెన్ మాంసంలో టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్ అధిక మోతాదులో వినియోగిస్తే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని గుర్తించారు. నిల్వవుంచిన చికెన్‌ను బయట పడేశారు. దేవాన్ష్ రెస్టారెంట్‌కు నోటీసులు అందించారు. నిబంధనలను అతిక్రమించి హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నిల్వ ఉంచిన చికెన్‌ను డస్ట్‌బిన్‌లో వేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

గాలిమరలో చెలరేగిన మంటలు



గాలిమర నుంచి వస్తున్న పొగ

కళ్యాణదుర్గం, జూన్ 26: మండల పరిధిలోని ఉప్పొంక గ్రామ సమీపంలో వున్న గ్రీన్‌కో కంపెనీ గాలిమర రెక్కల నుంచి బుధవారం మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ దారి లో వెళుతున్న పాదచారులు పొగలను చూసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సమాచారం అందుకున్న కంపెనీ ప్రతినిధులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు చెలరేగడానికి కారణాలను పరిశీలించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.

మత్స్యకారుల జీవితాలు..
అతలాకుతలం..!

● ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమానికి దూరం
● సబ్సిడీ చేపపిల్లల పదమే వినని వైనం
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారుల జీవితాలు అతలాకుతలం అయ్యాయి. అలివిగాని హామీలిచ్చి గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్లపాలనలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా... గతంలో ఉన్న సంక్షేమ పథకాలన్నీ నిర్వీర్యం చేసి, మత్స్యకారుల జీవితాలు మసకబారేలా చేశారనే చెప్పాలి. కనీసం చేపల వేటకెళ్లే మత్స్యకారులకు తెప్పలు, వలలు, బోట్లు తదితర సామగ్రిని అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా ఎంతోమంది మత్స్యకారులు తమ సొంత డబ్బులతో పరికరాలు కొనుగోలు చేసి వేటకు వెళ్లాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మరికొందరు తమ వృత్తిని సైతం వదులుకొని పట్టణాలకు వలసబాట పట్టారు. మరోవైపు సబ్సిడీతో అందించాల్సిన చేపపిల్లల పథకాన్ని అటకెక్కించి వారిని ఆర్థికంగా తీసింది గత ప్రభుత్వం. ఇలా ఐదేళ్లుగా నరకయాతన అనుభవించిన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వారిలో మళ్లీ ఆశలు చిగురింప చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు విశాఖలో మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో గతంలో ఏవైతే సంక్షేమ పథకాలు అమలు చేశామో వాటి గురించి ప్రస్తావించడం, మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం కృష్ణా జిల్లా ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. మత్స్యకారులకు తీర ప్రాంతాల్లో జెట్టీలు నిర్మిస్తామని, ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటామని హామీల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడంతో హామీలు నెరవేరుతాయన్న గట్టి నమ్మకంతో ఉన్నారు.



టీడీపీ హయాంలో అందించిన ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్లు



మత్స్యశాఖ కార్యాలయం

సంక్షేమానికి దూరం

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లాలోని మత్స్యకారుల జీవనోపాధుల మెరుగు కోసం ఎటువంటి సబ్సిడీలు లేకుండా ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసింది. 2016-17, 2017-18 సంవత్సరాలకుగానూ జిల్లాలోని అన్ని సొసైటీ, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ తదితర వాటికింద ఉన్న చెరువులన్నింటికీ చేపపిల్లలను ఉచితంగా అందించింది. ఒక హెక్టారు విస్తీర్ణం ఉన్న చెరువులకు 2,300 చేప పిల్లలు చొప్పున ఆయా చెరువుల విస్తీర్ణాన్ని బట్టి ఉచితంగా పంపిణీ చేసింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ చేపపిల్లల పంపిణీని అడ్డుకుందనే చెప్పాలి. ఈ చేపపిల్లలను పంపిణీ చేసే టెండరుదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా మత్స్యకారుల పొట్టకొట్టింది. ఫలితంగా ఆ టెండర్‌దారులు చేపపిల్లల సరఫరాను నిలిపివేశారు. దీంతో జిల్లాలోని పలువురు మత్స్యకారులు పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి చేప పిల్లలను కొనుగోలు చేసుకొని పెంపకం చేపట్టి వచ్చిన అరకొర లాభాలతో జీవనాన్ని నెట్టుకొచ్చారు. మరోవైపు మత్స్యకారులను ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వం సబ్సిడీతో పరికరాలు అందించింది. చేపల వేటకు వెళ్లే సమయంలో తెప్పలు, బోట్లు, మరబోట్లు, వలలు తదితర పరికరాలతో పాటు చేపల రవాణా కోసం టూవీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్, చేపల నిల్వ కోసం ఐస్ బాక్సులను అందించేవారు. వీటన్నింటిని వాటి ధరలకు అనగుణంగా బీసీలకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీలతో మత్స్యకారులకు అందించింది. వాటిని సైతం వైసీపీ ప్రభుత్వం పక్కనబెట్టేసి వారిని సంక్షేమాలకు దూరం చేసిందన్న విమర్శలు ఆ వర్గాల నుంచే వినిపించాయి.

పీఎంఎంఎస్‌వైతో మసిపూసే యత్నం

మత్స్యకారుల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో... ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) అందించే సంక్షేమ పథకాలను తామే అందిస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ఫోజులిచ్చింది. ఈ పథకం కింద మినీ ఫిష్ వెండింగ్ సెంటర్లు, కూలింగ్ యూనిట్లు, ఫిష్ పాండ్ల నిర్మాణం, చేపల రవాణాకు టూవీలర్, ఫోర్ వీలర్, చేపల అమ్మకం కోసం మినీ షెడ్లు తదితర వాటిని పొందుపరిచారు. వీటన్నింటిని కేటగిరీల వారిగా సబ్సిడీలు వర్తిస్తాయని అందులో పొందుపరిచారు. అయితే వీటిన్నింటిని చూసిన మత్స్యకారులు, వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఆ పథకాన్ని సక్రమంగా అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు లేకపోలేదు. కనీసం మత్స్యకారులు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించిన పాపాన పోలేదు. వచ్చిన వాటిని చెత్తబుట్టలకే పరిమితమయ్యాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమయ్యాయి.

చంద్రబాబుతోనే వెలుగులు..



వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. సంక్షేమ పథకాలను ఎత్తేయడంతో పాటు... ఏవేవో అమలు కాని ఫిష్ మార్కెట్లు, హబ్‌లని చెప్పి మత్స్యకారుల జీవితాలు నాశనం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో అందించిన ఉచిత చేపపిల్లలతో ఎంతో మంది మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. గతంలో మాదిరిగానే చంద్రబాబునాయుడు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతారని ఆశిస్తున్నాం.

-చేపల హరి, బెస్త సాధికారిత రాష్ట్ర కమిటీ సభ్యుడు

వైసీపీ పాలనలో ఉపాధి కోల్పోయాం...



వైసీపీ పాలనలో ఉపాధిని కోల్పోయాం. ఒక వల, ఒక బోటు, తెప్పలు ఇలా ఏవీ ఇవ్వకుండా చేసింది. మేమే చేతుల నుంచి తెచ్చుకొని వేటకు వెళ్లేవాళ్లం. టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు వర్తించాయి. చేపలు నిల్వ ఉంచుకోవడానికి ఐసు బాక్సులు, రవాణా చేసుకునేందుకు టూవీలర్, ఫోర్ వీలర్లు అందించింది. మళ్లీ టీడీపీతోనే న్యాయం జరుగుతుందనే ఎన్నికల్లో మద్దతు పలికాం.

- బెస్త శంకర్, శింగనమల

మళ్లీ సంక్షేమ పథకాలు వస్తాయి..



టీడీపీ గవర్నమెంటు వచ్చింది. మళ్లీ ఇంతకుముందు ఇచ్చినట్లే అన్ని పథకాలు వస్తాయి. ఆ నమ్మకంతోనే చంద్రబాబునాయుడును గెలిపించుకున్నాం. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల జీవితాలు నాశనమయ్యాయి. చేతి నుంచి డబ్బులు పెట్టుకొని చేపలు, తెప్పలు ఇలా చెప్పుకుంటూ అన్ని ఖర్చు పెట్టిందేగానీ... లాభం ఏం మిగలలేదు. ఇంతకుముందు మాదిరి ఉచితంగా చేపపిల్లలు, స్కూటర్లు అందించాలి.

- కృష్ణమూర్తి, మత్స్యకారుడు, శింగనమల

నట్టేట ముంచింది..



వైసీపీ ప్రభుత్వం ఫిష్‌ఆంధ్రాలని చెప్పి మత్స్యకారులను నట్టేట ముంచింది. ఊరికే రూ.30వేలు కట్టించుకొని లేనిపోనివన్ని చెప్పి నాశనం చేసింది. ఆ షాపులతో ఒరిగిందేమీ లేదు. అంతా నష్టమే. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వమొచ్చింది. ముందు మాదిరిగానే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ఫిష్ ఆంధ్రాలు లేకుండా సబ్సిడీలతో ఉండే మరిన్ని పథకాలు అమలు చేసి మత్స్యకారుల జీవనోపాధులు మెరుగుపడతాయి.

-కుళ్లాయప్ప, మత్స్యకారుడు, బుక్కరాయసముద్రం

ఇళ్ల వద్దకే పింఛన్

● జూలైలో రూ.197 కోట్ల పంపిణీకి సిద్ధం
● జిల్లాకు అదనంగా రూ.110 కోట్లు
● గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందితో పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 24: ఇళ్ల వద్దకే పింఛన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మూడు నెలలుగా ఇబ్బంది పడిన పండుటాకులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఓ వైపు పింఛన్ పెంచుతూ... మూడు నెలల బకాయిలతో కలిపి ఇంటి వద్దకే సొమ్మును అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు ఆ మేరకు అమలుపై దృష్టి సారించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతోపాటు జూలై నెలతో కలిపి చెల్లించాలని చర్యలు చేపట్టారు. జిల్లాకు 2,89,508 మంది పింఛన్‌దారులకు రూ.197.44కోట్లు నిధులు మంజూరు చేసింది. పింఛన్‌దారులు 2,89,805 మందికి రూ.126.81 కోట్లు, బకాయిలు రూ.70.62కోట్లు మొత్తం రూ.197.44కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నెల నుంచి రూ.4000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధులు 1,44,396 మందికి రూ.101 కోట్లు, వితంతువులు 66,749మందికి రూ.46.72 కోట్లు, చేనేతలు 6,759 మందికి రూ.4.73 కోట్లు, కల్లుగీత కార్మికులు 354 మందికి రూ.24లక్షలు, మత్స్యకారులు 890మందికి రూ.62లక్షలు, ఒంటరి మహిళలు 6,737మందికి రూ.4.70 కోట్లు, సఫాయి కర్మచారులు 3,525 మందికి రూ.2.41కోట్లు, హిజ్రాలు 207 మందికి రూ.1.45లక్షలు, హెచ్ఐవీ బాధితులు 2,476మందికి రూ.1.70కోట్లు, డప్పు కళాకారులు 3,137 మందికి రూ.2.19కోట్లు, కళాకారులు 185మందికి రూ.1.30లక్షలు, దివ్యాంగులు 46,351మందికి రూ.27.81 కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 391మందికి రూ.23 లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,444మందికి రూ.2,16కోట్లు, ప్రమాద బాధితులు 1091 మందికి రూ.1.63 కోట్లు ఇతరత్రా బాధితులకు కలిపి రూ.197.44 కోట్లు జూలైలో పంపిణీకి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జూలై 1వ తేదీ నుంచి ఇంటివద్దకే పింఛన్‌లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

టీడీపీకి ప్రచారం చేసినందుకు కక్ష సాధింపు

ఉరవకొండ, జూన్ 26: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం చేసినందుకు తనను పొదుపు సంఘం నుంచి తొలగించారని తులసి అనే మహిళ ఆందోళనకు దిగారు. యానిమేటర్, సీసీ కక్షసాధింపు చర్యలకు దిగారని ఆమె ఆరోపించారు. సీసీ వైఖరిని నిరసిస్తూ ఉరవకొండలోని వైకేపీ కార్యాలయం ఎదుట బుధవారం బైఠాయించి, నిరసన తెలిపారు. తనకు సమాచారం ఇవ్వకుండా సీసీ నారాయణస్వామి సంఘం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలోకి వెళ్లి సీసీతో వాగ్వాదానికి దిగారు. ఎవరు చెపితే తనను తొగించారని నిలదీశారు. ఏపీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. 2003 నుంచి సంఘంలో ఉన్నాననీ, వైసీపీకి పని చేయాలని సీసీ ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఆసరా డబ్బు తమ అకౌంట్‌లోకి కాకుండా అంగన్‌వాడీ టీచర్ ఖాతాలోకి ఎలా వేస్తారని ప్రశ్నించారు. సంఘం లీడర్‌కు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో డబ్బు స్వాహా చేశారని, సీసీ, యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె.. అధికారులను కోరారు.



సీసీని నిలదీస్తున్న తులసి



ధర్నా చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలు

కోటంక ఆలయంలో చోరీ కేసు ఛేదింపు

● నలుగురు దొంగల ముఠా అరెస్టు
● బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం, జూన్ 26: గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలోని గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును సీఎస్, గార్లదిన్నె పోలీసులు ఛేదించారు. ఈనెల 20వ తేదీన ఆలయ తాళాలు పగలకొట్టి లోపలికి చొరబడిన దొంగలు స్వామి మూలవిరాట్‌కు ధరింపజేసే రూ.13లక్షల విలువైన 16కిలోల వెండి ఆభరణాలు, 8తులాల బంగారు ఆభరణాలు, రెండు హుండీలు పగలకొట్టి రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఈ ఘటనలో నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. వారి నుంచి 16తులాల వెండి ఆభరణాలు, నాలుగు బంగారు తాళిబొట్లు, రెండు బైక్‌లు, రూ.2500 నగదు, ఐరన్‌రాడ్, కట్టర్, కట్టింగ్‌ప్లేయర్, క్యాటర్ బాల్, సిసి కెమెరాల హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, శింగనమల సీఐ శ్రీధర్, ఎస్ఐలతో కలిసి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వివరాలు వెల్లడించారు.

అరెస్టయిన నిందితులు వీరే...

శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన పవన్‌కుమార్, కడప జిల్లా సీకే దిన్నె మండలం ఎంఎంఎస్ మీదికి తండాకు చెందిన ఆవుల రాము, కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మదరం గ్రామానికి చెందిన వెంకటరమణ, కడప జిల్లా కేంద్రం బాలకృష్ణ నగర్‌కు చెందిన శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో పవన్‌కుమార్ కర్ణాటక రాష్ట్రం కోలార్, కొరటగేరీ, పట్టణాయక్ హళ్లి, కడప జిల్లా లింగాల, సిద్దవటం పోలీస్‌స్టేషన్లలోని దేవాలయాల దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆవుల రాముపై ప్రకాశం జిల్లా మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు ఉంది.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న పోలీసులు

రెక్కీ నిర్వహించి.. జైలుకెళ్లి..

ఈ కేసులో పవన్‌కుమార్ కీలకం. గత కొన్ని సంవత్సరాల నుంచి ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ప్రముఖ ఆలయాల్లో నిఘా పెట్టి దొంగతనాలు చేసేవాడు. ఈ క్రమంలో ఈ చోరీ ఘటనకు ముందు గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రెక్కీ నిర్వహించాడు. అదే సమయంలో ఓ కేసులో కడప సెంట్రల్ జైలుకు వెళ్లాడు. అక్కడ గంజాయి కేసులో అరెస్టయిన ఆవుల రాము, వెంకటరమణ, శ్రీనివాసులతో పరిచయం కలిగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బంగారు, వెండి ఆభరణాల గురించి చెప్పాడు. బెయిల్‌పై జైలు నుంచి విడుదలదయ్యారు. విడుదలైన 15రోజుల్లోనే ఆలయంలో చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. చోరీ ఘటన నేపథ్యంలో పాత నేరస్తులను విచారిస్తున్న క్రమంలోనే పవన్‌కుమార్ గురించి బయటపడింది. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగతనం చేసిన నిందితులను బుధవారం అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి సొత్తు స్వాధీనం చేసుకున్న సీఐలు శ్రీధర్, ఇస్మాయిల్, ఎస్ఐ గౌస్, హెచ్‌సీలు ఫిరోజ్‌సాహెబ్, దివాకర్, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీధర్ పాణి, మల్లికార్జున, శ్రీనివాసులు కానిస్టేబుళ్లు దేవ్లానాయక్, రంజిత్‌కుమార్, బాలకృష్ణను ఎస్పీ గౌతమిశాలి అభినందించారు.

పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ: డీఎస్ఓ

అనంతపురం టౌన్, జూన్ 26: జిల్లాలో పాత పద్ధతిలోనే జూలై నెల రేషన్ సరకులు పంపిణీ చేస్తామని డీఎస్ఓ శోభారాణి బుధవారం తెలిపారు. జూన్ నెల సరకులను జూలై 1 నుంచి 15వ తేదీ వరకు ఎండీయూ వాహనాల ద్వారానే లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు. జిల్లాలో 1,645 రేషన్‌షాపులు ఉన్నాయని, ఇప్పటికే బియ్యం, సరుకులు సరఫరా చేశామని అన్నారు. జొన్నలు అందుబాటులో ఉన్నాయని, బియ్యంతోపాటు రెండు కిలోల జొన్నలు పంపిణీ చేస్తామని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో రాగులు మిగిలాయనీ, అక్కడ బియ్యంతోపాటు రాగులు ఇస్తామని అన్నారు. రాగిపిండి సరఫరా చేయటం లేదని అన్నారు. ఇంకా నాలుగురోజులు సమయం ఉందని, అప్పటికి ఏమైనా నిబంధనలు వస్తే ఆ ప్రకారం లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

హరిత అనంతగా తీర్చిదిద్దాలి: కలెక్టర్



మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం అర్బన్, జూన్ 26: జిల్లాను హరిత అనంతగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. మొక్కలను నాటి, సంరక్షణ బాధ్యతలను కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లకు అప్పగించారు. ఈ మేరకు వారికి దత్తత సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లాలో ఈ నెలలో 100 కి.మీ. పరిధిలో లక్ష మొక్కలు నాటిస్తామని అన్నారు. ప్రతి మైదానం, వీధుల్లో మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించేందుకు దత్తత ఇస్తామని అన్నారు. నగరంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు వార్డుల వారీగా బాధ్యత కలిగిన అధికారులను నియమిస్తామన్నారు. నగరంలో మొక్కల పెంపకాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

సంక్షిప్తంగా..

హాస్టల్ ప్రహరీకి మరమ్మతులు



మరమ్మతులు చేసిన ప్రహరీ

అనంతపురం ప్రెస్‌క్లబ్: డీఈఓ కార్యాలయం పక్కన ఎస్సీ, బీసీ హాస్టల్ సముదాయం ప్రహరి కూలి దాదాపు నాలుగేళ్లు అవుతోంది. దీంతో హాస్టల్‌లోని విద్యార్థినులు అభద్రతాభావానికి గురయ్యేవారు. దీనిపై ఈనెల 19న ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించడంతో ఆ హాస్టల్ వార్డెన్లు స్పందించారు. హాస్టల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సొంత ఖర్చులతో ఆ గోడకు మరమ్మతులు చేయించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శింగనమల జూన్ 26: మండలంలోని సర్వసభ్యసమావేశాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శిగా ఆనందలక్ష్మి



అనంతపురం కల్చరల్, జూన్ 26: ఏపీ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అనంతపురం నగరానికి చెందిన ముడియం ఆనందలక్ష్మి ఎంపికయ్యారు. బుధవారం కర్నూలులో ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టీజీ వెంకటేష్ నేతృత్వంలో మహాసభ నాయకులు మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఇందులో ఆనందలక్ష్మిని రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈనెల 30వ తేదీన విజయవాడలో ఆమె ప్రమాణ స్వీకారం చేస్తారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

గార్లదిన్నె, జూన్ 26: కళ్యాణదుర్గం రూరల్ అంకంపల్లికి చెందిన 23 సంవత్సరాల సంధ్య అదృశ్యమైనట్లు స్థానిక పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈమె కళ్యాణదుర్గంలో నారాయణ స్కూల్లో టీచర్. ఈమె గత నెలలో పదిరోజుల పాటు గార్లదిన్నెలోని నారాయణ స్కూల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ అనంతరం టీచర్లు అందరు వారివారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. కాని సంధ్య మాత్రం ఇంటికి చేరలేదు. దీంతో తల్లిదండ్రులు కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి గార్లదిన్నె పోలీసులకు కేసు బదిలీ చేయడంతో మంగళవారం రాత్రి ఇక్కడి పోలీస్‌స్టేషన్‌లో యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

అనంతపురం క్రైం, జూన్ 26: కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని బీసీ కాలనీకి చెందిన రమాదేవి (58) మరణించింది. ఆమె తన భర్త సంజీవరాయుడుతో కలిసి బైక్‌పై అనంతపురం బయలుదేరారు. సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో వీరు యూటర్న్ తీసుకొంటుండుగా.. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో రమాదేవి అక్కడికక్కడే మరణించింది. సంజీవరాయుడికి స్వల్పగాయాల య్యాయి. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు తులాల బంగారు గొలుసు చోరీ

బుక్కరాయసముద్రం, జూన్ 26: అనంతపురం చెరువు కట్టపై బుధవారం రాత్రి ఓ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు చైను చోరీకి గురైంది. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన డి రాధమ్మ బుధవారం సాయంత్రం బుక్క రాయసముద్రంలో తమ బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. ఆటోలో అనంతపురానికి వచ్చింది. పాతవూరు చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్లేందుకు చెరువు కట్టపైకి నడిచి వెళ్తుండగా.. ఏపీ39ఎల్‌జీ 4404 నంబర్ బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. దీనిపై ఆమె బుక్కరాయ సముద్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టి రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచ్

రాప్తాడు, జూన్ 26: కొన్నేళ్ల నుంచి గుంతల మయంగా ఉన్న దారికి మరమ్మతులు చేపట్టారు. రాప్తాడులో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నుంచి పండమేరు వంక రైల్వే బ్రిడ్జి వరకూ, అక్కడి నుంచి పండమేటి వెంకటరమణస్వామి ఆలయం వరకూ దారి గుంతల మయంగా ఉంది. ఈ దారి గుండా రాప్తాడు నుంచి చిన్మయనగర్ మీదుగా అనంతపురానికి నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఈ గుంతల దారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు పంచాయతీ నిధులతో మట్టి తోలించి చదును చేయించారు.

వర్సిటీల్లో అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

అనంతపురం సెంట్రల్, జూన్ 26: ఎస్కేయూ, జేఎన్‌టీయూలో నిబంధనలు విస్మరించి వైసీపీకి అంటకాగిన అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా పారదర్శకమైన నిర్ణయాలు తీసుకుని విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సివుందన్నారు. అయితే జేఎన్‌టీయూ ప్రొఫెసర్ అయిన హేమచంద్రారెడ్డి వైసీపీ నాయకుడిగా వ్యవహరించి చైర్మన్ పదవిని చేపట్టారన్నారు. ఐదేళ్లలో వర్సిటీలను దోపిడిచేసేలా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో ఎస్కేయూ, జేఎన్‌టీయూ పరిపాలనాధికారులు వత్తాసుపలికి భాగస్వాములయ్యారని తెలిపారు. వారందరిపై చర్యలు తీసుకుని వర్సిటీల పరిపాలనను గాడిపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, విషయాన్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, నాయకులు సురేంద్ర, అనిల్, ఓబుల్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.


వీసీతో మాట్లాడుతున్న నాయకులు

వైసీపీ ఒత్తిళ్లతో తొలగించారు.. న్యాయం చేయండి



విద్యాశాఖ మంత్రి లోకేశ్, పరిటాల సునీతకు వినతిపత్రం అందజేస్తున్న కేజీబీవీ ఉద్యోగులు

మంత్రి లోకేశ్‌కు కేజీబీవీ ఉద్యోగుల వినతి

అనంతపురం విద్య, జూన్ 26: గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి కొందరు ఉద్యోగులను తొలగించారనీ, న్యాయం చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ నాయకులు బాలకాశి, విజయ్.. మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... సమగ్రశిక్ష ఉద్యోగులకు అండగా నిలవాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగులకు 2019 ఫిబ్రవరిలో ఇచ్చిన మినిమం టైం స్కేల్ జీవో, ఎంటీఎస్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో వేధింపులతో తొలగించిన వారిని యథావిధిగా కొనసాగించి న్యాయం చేయాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగుల్లో కొంతమందిని పర్ఫామెన్స్ పేరుతో రెన్యువల్ చేయలేదని, వారందరినీ యథావిధిగా కొనసాగించాలని కోరారు.

ఎమ్మెల్యే పరిటాల సునీతకు...

రామగిరి: కొన్నేళ్లగా కాంట్రాక్టు ప్రాతిపదికన తక్కువ వేతనాలతో పనిచేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు కేజీబీవీ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. బుధవారం వెంకటాపురంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. కేజీబీవీ ఉపాధ్యాయ రాష్ట్ర నాయకులు పలు సమస్యలను విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా 352 కేజీబీవీ పాఠశాలలు పనిచేస్తున్నాయని 4594 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని వారిని క్రమబద్ధీక రించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రాల్లో బాలికల విద్య కోసం ఏర్పాటుచేసిన పాఠశాలలోనే కాంట్రాక్టు పద్ధతిలోనే ఇప్పటి వరకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. పలు జీఓల ద్వారా మినిమం టైంస్కేల్ అమలు పరిచారని, తమకు ఇప్పటి వరకు టైంస్కేల్ అమలు కాలేదని అన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించండి


నారాలోకేశ్‌తో రెడ్డిప్రసాద్

అనంతపురం అర్బన్, జూన్ 26: వ్యవసాయ శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. బుధవారం విజయవాడలోని ఆయన నివాసంలో ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, నాయకులు శంకర్, నరేష్ బాబు కలిసి, వినతి పత్రం అందజేశారు. ఎంపీఈఓలుగా తమకు ఉద్యోగ అవకాశం కల్పించారన్నారు. వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఎంపీఈఓలకు అన్యాయం చేశారన్నారు. 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన ఎంపీఈఓలకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

12వ పీఆర్సీ ప్రకటించాలి: ఫోర్టో


మాట్లాడుతున్న ఫోర్టో రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ

అనంతపురం విద్య, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని నేరుగా ప్రకటించాలని ఫోర్టో రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం జిల్లా నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేసి సిబ్బందిని నియమించకుండా కాలయాపన చేసిందని మండిపడ్డారు. ఇప్పటికే ఏడాదికాలం ముగిసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి కమిషన్లు, కమిటీలు లేకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నేరుగా పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు అన్నింటినీ వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకకులు ఆదిశేషయ్య, వేణుగోపాల్, వెంకటేషులు, నాగేంద్ర, శ్రీనివాసులు, కేశవ్, పెద్దన్న, నాగేంద్ర, నాగరాజు, కిష్టప్ప పాల్గొన్నారు.

ఆర్టీసీపై నమ్మకాన్ని మరింత బలపర్చాలి

అనంతపురం కల్చరల్, జూన్ 26: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ప్రజల్లో ఇప్పటికే ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచి ఆర్టీసీ ఆదాయాభివృద్ధికి తోడ్పడాలని సత్యసాయి జిల్లా ఆర్ఎం మధుసూదన పేర్కొన్నారు. ఇంధన పొదుపు, ప్రమాదాల నివారణపై ఆర్ఎం కార్యాలయంలోని సమావేశమందిరంలో డ్రైవర్లకు నిర్వహిస్తున్న వారంరోజుల శిక్షణా తరగతులు బుధవారం రెండోరోజుకు చేరుకున్నాయి. డ్రైవర్స్ ట్రైనర్ ఎస్ఎండి హనీఫ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా ఆర్ఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లందరూ క్రమశిక్షణతో ఉంటూ పంచసూత్రాలు పాటించాలని, ఇంధన పొదుపు చేయడంతోపాటు ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణమందించడమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. అనంతరం డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి సీటీఎం రమేష్‌బాబు, ధర్మవరం డిపో మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.


డ్రైవర్లకు సూచనలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఆర్ఎం

వేలంపాట ద్వారానే చీనీ అమ్మకాలు చేపట్టాలి

ఎమ్మెల్యేకు ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 26: అనంతపురం మార్కెట్ యార్డులో వేలం పాట ద్వారా మాత్రమే చీనీకాయల అమ్మకాలు చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... వ్యాపారులు సిండికేట్ అయి రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ఈనామ్‌ను రద్దుచేసి మార్కెట్‌లో వేలంపాట ద్వారా అమ్మకాలు జరిపి, సూట్ తీసుకునే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న కమీషన్‌ను 10 శాతం నుంచి 4 శాతానికి తగ్గించాలని కోరారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఆ మరణాలు అతిసారతో కాదట..!

జిల్లా వైద్యశాఖ నివేదిక

అనంతపురం టౌన్, జూన్ 26: జిల్లాలో అతిసారతో ఏ ఒక్కరూ చనిపోలేదని జిల్లా వైద్యశాఖ నిర్ధారణ నివేదిక ఉన్నతాధికారులకు పంపించింది. జిల్లాలో నలుగురు మరణించారని పత్రికలలో కథనాలు రావడంతో రాష్ట్రప్రభుత్వంతో పాటు వైద్యశాఖామంత్రి, కలెక్టరు వాటిపై సీరియస్‌గా స్పందించి ఆరాతీయడంతో పాటు వాస్తవ నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అదే సమయంలో అతిసార నివారణకు పగడ్బందీగా చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు సకాలంలో వైద్యచికిత్సలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డీఎంఓ డాక్టర్ ఓబులు ఇతర సిబ్బంది రంగంలోకి దిగారు. పామిడి మండలం ఎగువతండాలో మంగళవారం ఒకరు చనిపోగా.. అంతకుముందు ఇద్దరు అదే గ్రామంలో చనిపోయారని ప్రచారం జరిగింది. ఈ మరణాలపై వైద్యశాఖ బృందం విచారణకు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించింది. రేణుక అనే మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా ఈనెల 18న వాంతులు, విరేచనాలతో జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్సపొందారని, ఇక్కడ నయంకావడంతో డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిందని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత తెలిపారు. ఆ తర్వాత మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో జిల్లా కేంద్రంలోని సవేరా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి అక్కడ కిడ్నీకి సంబంధించి డయాలసిస్ చేయించుకున్నారని, వెంటిలేటర్ చికిత్స అందించినా కోలుకోకపోవడంతో ఇంటికి తీసికెళుతుండగా చనిపోయినట్లు తేలిందని తెలిపారు. అంతకు ముందు ఇద్దరు కూడా అతిసారతో చనిపోలేదని, ఒకరు వాటర్‌ట్యాంకు కడగడానికి ఎక్కి ప్రమాదానికి గురై బాధపడుతూ చనిపోగా... ఇంకో మహిళ కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చనిపోయినట్లు వారి కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందన్నారు. ఉరవకొండ మండలం చిన్న ముష్టూరులో బుధవారం ఒకరు చనిపోయారని.. ఆయన గుండె పోటుకు గురై మరణించినట్లు అక్కడి వైద్యులు తెలిపారని అన్నారు. ఇదే విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు.

పార్లమెంట్ సభ్యుల సమావేశంలో ఎంపీ అంబికా


సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, జూన్ 26: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం పార్లమెంట్ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీలతో పాటు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించాలని మోదీని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో యువతరం నిర్వీర్యం



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, జూన్ 26: మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత నైపుణ్యాలు నిర్వీర్యమై జాతికి తీరని నష్టం వాటిల్లుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణాకు పలు బలహీనతలు కారణాలవుతున్నాయని, వాటిని అధిగమించడంలో బాధితులకు సహకరించాలని కోరారు. బాధిత మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయసేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇటిక నల్లప్ప, హరికృష్ణ, ఆటో కార్మికులు, శ్రీ విజయనగర న్యాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రాణాంతకమైన మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం నగరంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ నుంచి జడ్పీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీఐలు రెడ్డప్ప, క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి, నారాయణ రెడ్డి, సెబ్ సీఐ యల్లయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలపై స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) విభాగం సీఐ యల్లయ్య బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో ఎస్సై సర్వతి, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, సతీష్, కానిస్టేబుల్ వెంకటేష్, రమేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాప్తాడు: అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో రాప్తాడులో ఉన్నత పాఠశాల విద్యార్థులో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాప్తాడు సీఐ మునిస్వామి, తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ మల్లికార్జున, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీగా పూజిత

అనంతపురం న్యూటౌన్: అనంతపురం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఎస్పీగా పూజితను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎస్పీగా ఉన్న మాసూమ్ బాషాను బదిలీ చేయడంతో ఆ స్థానంలో కర్నూలు విజిలెన్స్ ఏఎస్పీగా ఉన్న పూజితకు జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వారం, పది రోజుల్లో రెగ్యులర్ ఎస్పీని నియమించే అవకాశముంది.

పేద పిల్లలకు విద్యాపథకాలు అందాలి: కలెక్టర్



అనంతపురం టౌన్, జూన్ 26: ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యాపథకాలు అర్హులైన పేదపిల్లలకు అందేలా చూడాలని విద్యాశాఖల అధికారులను కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ, గురుకులాలు, కేజీబీవీలలో చదువుకోవడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆశక్తి చూపుతున్నారన్నారు. అందులో వసతులు బాగా ఉండడం వల్లే వాటిపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రధానంగా అనాథలు, నిరుపేదలు, అట్టడుగువర్గాలకు చెందిన పిల్లలను ఈ విద్యాలయాల్లో అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపినవారికి ప్రాధాన్యత కల్పిస్తూనే మిగిలిపోయిన సీట్లకు నిజంగా అవసరమైన పిల్లలకు కేటాయించాలన్నారు. జడ్పీ సీఈఓ నేతృత్వంలో డీఈఓ, సాంఘిక సంక్షేమశాఖ జేడీ, ఇతర సంక్షేమశాఖల అధికారులతో కలిసి సమన్వయ కమిటీ వేయడం వేస్తామన్నారు. అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్కూల్‌కిట్లు వెంటనే ప్రతి విద్యార్థికి అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, డీఈఓ వరలక్ష్మి, వేల్ఫేర్ శాఖల అధికారులు మదుసూదన్, రామాంజినేయులు, డీవీఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో అనుష్కకు రికార్డు మార్కులు


ఓటేటి అనుష్కను అభినందిస్తున్న కోర్ డీన్, ఇతర సిబ్బంది

అనంతపురం విద్య, జూన్ 26: ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థి అనుష్కకు స్టేట్ మార్కులు వచ్చాయని నారాయణ జూనియర్ కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, ఇతర అధికారులు తెలిపారు. బుధవారం ఫలితాల విడుదల తర్వాత విద్యార్థిని కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. తర్వాత వారు మాట్లాడుతూ... నారాయణ జూనియర్ కళాశాల (డే స్కాలర్ గర్ల్స్)కు చెందిన ఓటేటి అనుష్క ఇప్పటి వరకూ జూనియర్ ఇంటర్‌లో ఏ విద్యార్థీ సాధించని మార్కులు సాధించిందన్నారు. 470 మార్కులకు 468 మార్కులు సాధించిందని పేర్కొన్నారు. అదేవిధంగా సప్లీ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సైతం 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాళ్లు హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

సురేఖకు 467 మార్కులు


ప్రతిభచాటిన విద్యార్థులతో ఎస్ఆర్ కళాశాల సిబ్బంది

ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి సురేఖకు 470కి 467 మార్కులు వచ్చినట్లు ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జ్ శివకుమార్, ఏజీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. గుత్తిరోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కాలేజ్‌లో మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థిని పాటిల్ సురేఖ ఎంపీసీలో 470 మార్కులకు 467 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. సురేఖ స్టేట్‌లోనే అత్యుత్తమ మార్కులు సాధించినట్లు స్పష్టం చేశారు. దీనిపై జోనల్ ఇన్‌చార్జ్, ఏజీఎం, ప్రిన్సిపాల్ భవానీ ఆనందం వ్యక్తం చేశారు.

వైద్యుడి లైంగిక వేధింపులపై విచారణ


ఎన్ఎస్ గేటు ఆస్పత్రి వద్ద విచారణ కమిటీ వైద్యుల బృందం

చెన్నేకొత్తపల్లి, జూన్ 26 : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మండలంలోని ఎన్ఎస్ గేటు ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు ఉదయ్‌పై వైద్యుల కమిటీ బృందం బుధవారం విచారణ చేపట్టింది. తమను డాక్టర్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఆస్పత్రికి సంబంధించిన పలువురు ఏఎన్ఎంలు మంగళవారం పుట్టపర్తిలో డీఎంహెచ్ఓ మంజుల వాణికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు... వైద్యులు నివేదిత, అనూరాధ, వీరమ్మ, రాములక్ష్మమ్మలతో కూడిన కమిటీ బృందం బుధవారం ఎన్ఎస్‌గేటు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టింది. ఫిర్యాదు చేసిన బాధితులతోపాటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మిగిలిన ఏఎన్ఎంలందరిని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించింది. విచారణ అనంతరం నివేదికను డీఎంహెచ్ఓకు అందజేస్తామని ఆ బృందం సభ్యులు తెలిపారు. కాగా, ఈ విచారణకు డాక్టర్ ఉదయ్ గైర్హాజరయ్యారు.

డాక్టర్‌ను సస్పెండ్ చేయాలి : లైంగిక వేధింపులకు పాల్పడిన డాక్టర్ ఉదయ్‌ను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. స్థానిక ఆస్పత్రి ఎదుట సీఐటీయూ మండల నాయకులు లింగన్న ఆధ్వర్యంలో వారు బైఠాయించి నిరసన చేపట్టారు. విచారణకు వచ్చిన కమిటీ ఎదుట ఆ వైద్యుడు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు.

సెంట్రల్ వర్సిటీలో పచ్చదనం అభివృద్ధికి చర్యలు

బుక్కరాయసముద్రం : సెంట్రల్ యూనివర్సిటీలో పచ్చదనం అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని జంతులూరు గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో పచ్చదనం, తోటలపెంపకం ఏర్పాటుపై ఆయన పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి చెట్లను ఏర్పాటు చేసే అంశంపై అటవీశాఖ, సెంట్రల్ యూనివర్సిటీ సిబ్బంది పరిశీలించారు సెంట్రల్ యూనివర్సిటీ, సీపీడబ్ల్యూడీ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రస్తాలుగా దళితుల భూములే ఎందుకు.?

గార్లదిన్నె : దళితుల భూముల్లో ఎక్కడ పడితే అక్కడ రస్తాలు తీసుకోవడం ఏంటని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్ళాయప్ప ప్రశ్నించారు. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో దళితులకు సంబంధించిన భూమి మధ్యలో రస్తా వదలాలని ఓ వర్గం వారు దళితులను బెదిస్తున్నారని ఆరోపించారు. బుధవారం దళిత సంఘాల నాయకులు పొలాంలోకి వెళ్లి పరిశీలించారు. ఎక్స్ ఆర్మీ చిన్ననారాయణకు ప్రభుత్వం 3.11 సెంట్ల భుమిని ఇచ్చిందన్నారు. చుట్టపక్కల రైతులు.. ఆ భూమిలో రస్తా ఇవ్వాలని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు రెవెన్యూ, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప, మల్లికార్జున, ఓబుళపతి, రామాంజినేయులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

పలు ప్రాంతాల్లో ప్రపంచ మత్తు పదార్థాల నిర్మూలన దినం

మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని పలువురు అధికారులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ప్రపంచ మత్తు పదార్థాల నిర్మూలన దినాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తుంటే 14500 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడళ్లలో మానవహారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, సెబ్ అధికారులు, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



కళ్యాణదుర్గంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినంపై ర్యాలీ చేపట్టిన టౌన్ సీఐ, ఎక్సైజ్ సిబ్బంది


విడపనకల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


కణేకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



రాయదుర్గం: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ


యాడికి: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


తాడిపత్రిటౌన్: అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ


కంబదూరులో విద్యార్థుల మానవహారం

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించండి

పుట్లూరు, జూన్ 26: మండలంలో ఎలాంటి అవినీతి లేకుండా ఉపాధి పనులు నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఏపీడీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద తప్పనిసరిగా మస్టర్లలో కూలీలతో సంతకాలు పెట్టించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పనులు చేయించాలని సూచించారు. అనంతరం బాలాపురం పంచాయతీలోని ఓ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలపై విచారణ చేశారు. సమావేశంలో ఏపీఓ చెన్నకేశవులు, ఇన్‌చార్జ్ ఈసీ విజయనాగేంద్రరెడ్డి, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం, జూన్ 26: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్న ఉద్దేశంతో నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో పెద్దఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని దేవీరమ్మ కాలనీలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. బడిఈడు పిల్లలందరు ప్రతి ఒక్కరు బడిలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమారి, బాబు, మున్సిపల్ కమిషనర్ నర్సారెడ్డి, హెచ్ఎం మధుసూదన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి ఎగువతండాలో పర్యటించిన అధికారులు

పామిడి, జూన్ 26: మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామంలో అతిసార వ్యాపించడంతో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆర్డీటీ స్కూల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. గ్రామంలోని ఒక చేతి పంపు నీటి వల్లే అతిసారా వ్యాపించిందని అధికారులు వెల్లడించారు. గ్రామం మొత్తం పర్యటించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలో అతిసారా నివారణ అయ్యేంత వరకూ ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. గ్రామంలో 18 మంది అతిసారాతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖాధికారులతో గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ చర్చించారు. అనంతరం అతిసారతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ యుగంధర్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ శశికళ తదితర అధికారులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత

స్థలాల ఆక్రమణలపై విచారణ చేయండి

మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే జయరాం ఆదేశం

గుంతకల్లు, జూన్26: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో జరుగుతున్న, జరిగిన నివాస స్థలాల ఆక్రమణ విషయంగా సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మునిసిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన నిర్వహించిన మునిసిపల్ అత్యవసర సమావేశానికి ఎమ్మెల్యే జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వహాబ్ మృతిపట్ల కౌన్సిల్ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది. అనంతరం జయరాం మాట్లాడుతూ దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీల్లో కొందరు సొంత జాగీర్ల మాదిరిగా పదుల సంఖ్యలో పట్టాలను స్వాధీనం చేసుకుని పబ్బం గడుపుకుంటున్నారని, అలాంటి స్థలాల ఆక్రమణలపై విచారణ చేపట్టాలన్నారు. పట్టణంలో తోపుడు బండ్లు, గంపలలో పండ్లు, తదితర వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారుల నుంచి సుంకాలు వసూలు చేయకుండా సవరణ చేయాలన్నారు. దీనిపై కమిషనరు వెంకటరమణయ్య మాట్లాడుతూ టెండరు కాలం పూర్తయ్యాక నిబంధనలను చేర్చి కొత్త బిడ్‌లను ఆహ్వానిస్తామని తెలియజేశారు. చివరలో ఎమ్మెల్యే జయరాంను కౌన్సిల్ సభ్యులు సత్కరించారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలోని వాటర్ ట్యాంక్ ఆవరణలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం ఉదయం మొక్కలను నాటారు. పట్టణంలో పచ్చదనం పెంచాల్సిన అవసరముందని, నాటిన మొక్కలను మునిసిపల్ అధికారులు పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, కమిషనరు వెంకట రమణయ్య, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, టీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు

గుమ్మనూరును సత్కరించిన తెలుగు తమ్ముళ్లు

పామిడి: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను తెలుగు తమ్ముళ్లు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. గుంతకల్లు శాసనసభ్యులుగా మనవిజయం సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిక్కిలి రంగనాయకులు, హుసేన్‌పీరా, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా పెట్టండి: ఎస్పీ


యల్లనూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్లూరు/ యల్లనూరు, జూన్26: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం పలు కేసులకు సంబంధించి రికార్డులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమెవెంట సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులతోపాటు మండల సమస్యలపై ఆరాతీశారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ సంపత్, శ్రీనివాస్‌గౌడ్ సిబ్బంది ఉన్నారు.

అరగంటలో ముగిసిన కౌన్సిల్‌మీట్


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి టౌన్, జూన్ 26: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అత్యవసర కౌన్సిల్ మీట్ జరిగింది. ఆరునెలల తర్వాత జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆరు అంశాలను ఆమోదించి అరగంటలో ముగించారు. సీనియర్ అసిస్టెంట్ నాగరాజు అజెండాను చదివి సభ్యులకు వినిపించారు. ముందుగా పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న వాటర్‌వర్క్స్ నుంచి నందలపాడు వాటర్‌వర్క్స్‌లో నిర్వహణకు సంబంధించి నిధులపై చర్చించారు. వీధిలైట్లు, ఎల్ఈడీ లైట్లకు సంబంధించి ఎక్కువగా మరమ్మతులు ఉండడంతో వాటికి సంబంధించిన బిల్లును ఆమోదించారు. అరవింద వాటర్‌వర్క్స్, బుగ్గ వాటర్‌వర్క్స్, నందలపాడులో ఉన్న వాటర్‌వర్క్స్‌లో తాగునీటికి సంబంధించిన క్లోరిన్ గ్యాస్ కొనుగోలుకు రూ.12లక్షలు ప్రతిపాదించి ఆమోదించారు. టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని రెడ్డివారిపాలెంలో ఉన్న సర్‌సీవీ రామన్ జూనియర్, డిగ్రీ కళాశాల భవనం నాణ్యత ప్రశ్నార్థకంగా ఉందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాంమోహన్, వైస్‌చైర్మన్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధి పనుల అవకతవకలపై విచారణ


పనులు చేశామని చెబుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి, జూన్ 26: కలెక్టర్ ఆదేశాలతో మండల పరిధిలోని తెనగల్లు గ్రామంలో గత నెలలో జరిగిన ఉపాధి పనులపై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన రామాంజినేయులు తన పొలంలో ఉపాధి పనులు చేయకనే చేసినట్లు చూపి ఫీల్డ్ అసిస్టెంట్ నిధులు స్వాహా చేశాడని సోమవారం కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఏపీడీ రమేష్ నాయక్ గ్రామంలో పర్యటించి బాధితులతో వివరాలు సేకరించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఏపీడీ తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ

బొమ్మనహాళ్, జూన్ 26: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విశ్వవిద్యాలయంలో బుధవారం బాల్య వివాహాలు, గృహహింస చట్టాల గురించి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బొమ్మనహాళ్ తహసీల్దార్ రామాంజినమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. బాల్యవివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇన్‌చార్జ్ రఘునాథ్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు మతిస్థిమితం లేని బాలిక

కణేకల్లు, జూన్ 26: మండల కేంద్రంలోని ముల్లావీధికి చెందిన అసిఫాభాను అనే మతిస్థిమితం కోల్పోయిన బాలికను పోలీసులు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛందసంస్థకు అప్పగించారు. అసిఫాభాను మతిస్థిమితం కోల్పోయి గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలోని పలు వీధులలో అభ్యంతకర రీతిలో తిరుగుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసిఫాభానుకు కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో బుధవారం ఎస్ఐ శ్రీనివాసులు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో అసిఫాభానును తాడిపత్రిలోని జీవనాలయం అనే స్వచ్ఛంద సంస్థలో చేర్పించేందుకు ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు.

ఫ్యాక్టరీలతో రైతులకు తీవ్ర నష్టం


రైతుల పొలాల్లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 26: మండలంలోని నేమకల్లు గ్రామ పరిధిలో ఉండే స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున ఆరోపించారు. బుధవారం ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలను స్థానిక రైతులతో కలిసి వారు పరిశీలించారు. ఈ ఫ్యాక్టరీల కాల్యుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నా పరిహారం ఇవ్వడంలో ఫ్యాక్టరీల యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌస్, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు అంజి, కొత్రేష్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా రాజీనామా చేయించారు

గుత్తి, జూన్ 26: తమ చేత బలవంతంగా రాజీనామా చేయించారని, న్యాయం చేయాలని గుత్తి మున్సిపల్ పరిధిలోని 40 మంది వలంటీర్లు మున్సిపల్‌కమీషనర్ శ్రీనివాసులుకు బుధవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మేం రాజీనామా చేసి పొరపాటు చేశామన్నారు. తమను మళ్లీ వలంటీర్లుగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, వసంకుమార్, ఓబుళేసు, భార్గవి, శ్రీదేవి, జిలాన్, షేక్షావలి, సుజాత, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి జితేంద్రగౌడు నివాళి

గుంతకల్లు, జూన్26: పట్టణానికి చెందిన సీపీఐ నాయకుడు, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వహాబ్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అబ్దుల్ వహాబ్ మృతిచెందిన సమాచారం తెలియడంతో జితేంద్రగౌడు బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు.

● తమ పార్టీ నాయకుడిగా అబ్దుల్ వహాబ్ అమూల్యమైన సేవలను అందించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ పేర్కొన్నారు. బుధవారం జగదీశ్ పార్టీ నాయకులతో కలసి అబ్దుల్ వహాబ్ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ నాయకుడిగా, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడిగా వహాబ్ ఎన్నో పోరాటాలలో పాల్గొన్నాడన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపి, సంతాపం ప్రకటించారు. సంతాపం తెలిపినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ గోవిందు, నాయకులు గోపీనాథ్, దేవేంద్ర, ఈశ్వరయ్య, వినోద్, మల్లయ్య, బాబాఫక్రుద్దీన్, చిదంబరన్న, తదితరులు పాల్గొన్నారు.


వహాబ్ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జితేంద్రగౌడు

సివిల్ సప్లై గోడాన్ తనిఖీ

ఉరవకొండ, జూన్26: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న సివిల్ సప్లై గోడాన్‌ను గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. గోదాములోని రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూకాలలో ఎలాంటి తేడాలు ఉండరాదని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ హరిప్రసాద్, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జీ చంద్రశేఖర్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ కేవైసీ చేయించుకోండి

యల్లనూరు, జూన్26: మండలంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన డబ్బులు ఖాతాల్లో జమకాని రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈకేవైసీ చేయించుకొనే వారి జాబితా ఇప్పటికే తమ సిబ్బంది వద్ద ఉంచామన్నారు. సంబంధిత ఆర్బీకేల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది వద్దకు ఆధార్‌కార్డు తీసుకొని వెళ్లాలని సూచించారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై కేసు

పెద్దవడుగూరు, జూన్26: మండలంలోని అప్పేచర్ల గ్రామ సచివాలయ భవనంపై ఉన్న నవరత్నాలతో కూడిన శిలాఫలకాన్ని ఇదే గ్రామానికి చెందిన శంకర్‌నాయుడు, భరత్ ధ్వంసం చేసినట్లు సచివాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

తండ్రిని హతమార్చిన కుమారుడు

కూడేరు, జూన్ 26: మండలంలోని కమ్మూరు గ్రామంలో తండ్రిపై కొడుకు గడ్డ పారతో దాడి చేసి హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన చిన్న ఆంజినేయులు (65) కొంత కాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడేవాడు. గ్రామంలో కనిపించిన వారిని తిట్టేవాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులను తిట్టడంతో ఆవేశంతో కుమారుడు తిరుపాల్ గడ్డపారతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ధృవీకరించారు. సీఐ శివరాముడు శవాన్ని పరిశీలించి మృతుడి భార్య శాంతమ్మతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఎన్‌సీసీలో శిక్షణతో ప్రభుత్వ ఉద్యోగాలు


శిక్షణను పరిశీలిస్తున్న గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్. రమేష్

కూడేరు, జూన్26: ఎన్‌సీసీ క్యాంపుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలు వస్తాయని గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్. రమేష్ పేర్కొన్నారు. మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో జరుగుతున్న శిక్షణా శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తళ్‌సైనిక్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థులకు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్ తదితర అంశాల మీద శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు నిస్వార్థం, నిజాయతీ, క్రమశిక్షణ తదితర వాటిని పెంపొందించుకోవడానికి అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సిక్స్ ఆంధ్ర బాలుర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కులకర్ణి, సుబేదార్ మేజర్ బల్బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

తాడిపత్రిటౌన్, జూన్26: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి నంద్యాలరోడ్డు వరకు ఉన్న సీసీ రోడ్లు నెర్రెలు చీలి చాలా వరకు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారాయని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారి సురేష్‌నాయక్‌ను బుధవారం కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప, జూన్ 26: సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కార్తీక్ రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బందికి డయేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళా వైద్యులు ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

1న ఇంటి వద్దకే చౌకధాన్యం ఇవ్వాలి

గుంతకల్లు, జూన్26: వచ్చే నెల 1వ తేదీ నుంచి స్టోర్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారుల ఇళ్ల వద్దకే నిత్యావసర వస్తువులను అందజేయాలని ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్టోరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశాన్ని నిర్వహించారు. 1న ఉదయం 7 గంటల నుంచే రేషన్ సరఫరాను ప్రారంభించాలని, ఆ విధంగా సీఎస్‌డీటీలు చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ నుంచి 30వ తేదీకల్లా చౌకధాన్యం రేషన్ షాపులకు చేరేలా తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లు, సీఎస్‌డీటీలో పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కార్యక్రమం

బ్రహ్మసముద్రం, జూన్ 26 : మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాజేష్‌కుమార్ మాట్లాడుతూ అందరూ పరిశుభ్రత పాటించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గుమ్మఘట్ట, జూన్ 26: మండలంలోని వేదవతిహగరి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రంగచేడు గ్రామం వద్ద నుంచి ఇసుక లోడ్ చేసుకుని రాయదుర్గం పట్టణానికి తరలిస్తుండగా 75 వీరాపురం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.